
సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 13 । జూన్ । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



తీరం కళకళ.. కాసుల గలగల

వేట నిషేధంతో రెండు నెలలుగా బోసిపోయిన అమీనాబాద్ సముద్ర తీరం సోమవారం మత్స్యకారుల సందడితో కళకళలాడింది.

- వివరాలు 8లో▸

గరిష్టం/కనిష్టం
45.5° / 29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	45.5	30.0
కాకినాడ	41.6	30.4
అమలాపురం	41.0	29.0

న్యూస్‌రీల్

పోలీసు స్పందనకు 36 ఫిర్యాదులు

కంబాలచెరువు: ప్రజల సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ ఆదేశించారు. స్పందనకు వచ్చిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. దీనికి సివిల్ 20, కుటుంబ తగాదాలు 6, ఇతర కేసులకు సంబంధించి 10 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ నేరుగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు ఎస్పీ ముందు స్వేచ్ఛగా వివరించారు. వీటిపై పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను నిర్దిష్ట కాలవ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఎస్.తేజ్ భరత్, డీఆర్వో జే.నరసింహులుతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో 105 అర్జీలు స్వీకరించామని, వీటిలో ఆన్‌లైన్ ద్వారా 88, ఆఫ్‌లైన్ ద్వారా 17 వచ్చాయన్నారు. అర్జీల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లేటప్పుడు అర్జీదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీలపై సంబంధితశాఖలు సకాలంలో స్పందించాలన్నారు. కార్యక్రమంలో టూరిజం డివిజనల్ మేనేజర్ పి.స్వామినాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసాలు



సుధీర్‌కుమార్, ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి, డబ్బులు గుంజుతున్న మోసగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ మధ్యకాలంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు ఆశ చూపి, అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసగిస్తున్నారన్నారు. పరీక్షలు, ఇంటర్వ్యూలు లేకుండా ఉద్యోగ నియామకాలు జరగవన్నారు. వాటి విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే సంబంధించిన కార్యాలయాలలో సంప్రదించాలన్నారు.ఫేక్ నియామకాలతో నిరుద్యోగులు మోసపోవద్దన్నారు. ఈ విధంగా పలు ఫిర్యాదులు జిల్లా పోలీసుల దృష్టికి వచ్చాయన్నారు. అలాగే ఉద్యోగాల కోసం డబ్బులు ఇవ్వడం కూడా నేరమన్నారు.

సూర్యదేవాలయానికి విరాళం

గోకవరం: గోకవరంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీస్కంద బాలాజీ సూర్యదేవాలయానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన కొఠాని కేశవరావు తన తండ్రి అనంతానందగిరి జ్ఞాపకార్థం రూ.1,18,118 విరాళంగా అందించినట్టు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు సోమవారం తెలిపారు. సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో దాతలు అక్షింతల రాజా, రాణి దంపతుల ప్రోత్సాహంతో దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. దాత తండ్రి అనంతానందగిరి గతంలో గోకవరం మండల ప్రజానీకానికి భగవద్గీత బోధించారన్నారు.

నేడు, రేపు టెన్త్ సప్లిమెంటరీ మూల్యాంకనం

రాయవరం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నారు. ఇందుకు అమలాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించగా.. 8వ తేదీతో ప్రధాన పరీక్షలు పూర్తయ్యాయి. 9, 10 తేదీల్లో ఓఎస్ఎస్‌సీ, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 20,331 సమాధాన పత్రాలు జిల్లా కేంద్రమైన అమలాపురానికి చేరాయి.

మృత్యువేగం.. తెగిన బంధం

- అనంతపల్లి ఘోర కారు ప్రమాదంలో మృతులందరూ దగ్గరి బంధువులే
- ఇద్దరు తండ్రీకొడుకులు
- ఇద్దరు తల్లీబిడ్డలు
- ఇద్దరు అక్కచెల్లెళ్లు
- మూడు జిల్లాల్లో విషాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నల్లజర్ల/కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/చాగల్లు/ఆత్రేయపురం/పోలవరం రూరల్: వారందరూ బంధువులు. తూర్పు గోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన వారు. హైదరాబాద్‌లో జరిగిన గృహప్రవేశ వేడుకకు ఈ నెల 8న వెళ్లారు. తిరిగి బంధువు కారులో బయలుదేరారు. రోడ్డు సాఫీగా ఉంది. కారు జోరుగా పరుగులు తీస్తోంది. అంతా అనుకున్నట్టు జరిగితే.. మరో గంటా గంటన్నరలో అందరూ ఇళ్లకు క్షేమంగా చేరుకునే వారే. అంతలోనే విధి చిన్నచూపు చూసింది. ఏడుగురి ప్రాణాలను కబళించింది. మృతుల్లో నలుగురు మహిళలు, ఆరు నెలల చిన్నారి ఉన్నారు. రెప్పపాటులో అనుబంధాలను నిర్దాక్షిణ్యంగా చిదిమేసిన ఈ ఘోర ప్రమాదం ఆ కుటుంబాల్లో పెను విషాదం నింపింది.

తీసుకు వచ్చిన కారే.. మృత్యుశకటమై..

ప్రమాదానికి గురైన కారులో ప్రయాణిస్తున్న వారందరూ రాజమహేంద్రవరానికి చెందిన మిద్దే సత్యనారాయణకు దగ్గరి బంధువులు. ఆయన స్వస్థలం ఆత్రేయపురం మండలం వెలిచేరు శివారు ఊదలమ్మ గొడపాలెం. రాజమహేంద్రవరంలో నివసిస్తూ.. ఇక్కడి ప్రకాశ్ నగర్‌లో కార్ ఎస్ కార్స్ పేరుతో పాత కార్ల అమ్మకం, కొనే వ్యాపారం చేస్తుంటారు. ప్రమాదానికి గురైన కారును దాని యజమాని మృతుడు మిద్దే సత్యనారాయణ షెడ్డులో ఉంచారు. ఆయనకు సత్యనారాయణ ఫోన్ చేసి, కారులో హైదరాబాద్ వెళ్తామని చెప్పారు. ఆయన సరేననడంతో సత్యనారాయణ, ఆయన కుమారులు సాయికుమార్, రవితేజ ఆ కారులో హైదరాబాద్ వెళ్లారు. అదే కారులో ఆదివారం రాత్రి తిరుగు పయనమయ్యారు. కారు ఖాళీగా ఉండటంతో మిగిలిన బంధువులు అందులో ఎక్కారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద ఉన్న ఫ్లై ఓవర్ వంతెనపై ఆగి ఉన్న లారీని వీరి కారు సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో బలంగా ఢీకొంది.

ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మిద్దే సత్యనారాయణ (46), ఆయన కుమారుడు రవితేజ (24), మిద్దే అరుణ (26 – ఆత్రేయపురం మండలం వెలిచేరు శివారు ఊదలమ్మ గొడపాలెం), దాసరి శ్రావణి కుమారి (26 – ఏలూరు జిల్లా పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేట), ఆమె కుమారుడు లోహిత్ గగన్ సాయి (6 నెలలు), రేలంగి లక్ష్మి (50 – చాగల్లు మండలం ఊనగట్ల) అక్కడికక్కడే మృతి చెందారు. ఆత్కూరి దుర్గ (50 – చాగల్లు మండలం మీనానగరం) కొవ్వూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో క్షతగాత్రుడు మిద్దే సాయికుమార్‌ను తొలుత కొవ్వూరు, అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మృత్యువులోను వీడని పేగుబంధం

- ప్రమాదంలో తండ్రి సత్యనారాయణ, తమ్ముడు తేజలను కోల్పోయానంటూ సాయికుమార్ విలపిస్తున్నాడు. సత్యనారాయణ పెద్ద కుమారుడు రాజమహేంద్రవరంలో కార్ ఏసీ షాపులో పని చేస్తున్నాడు. ప్రమాదానికి గురైన కారు వెనుక సీట్లో కూర్చున్నాడు. ప్రమాదం నుంచి బయటపడ్డాడు. సత్యనారాయణ రెండో కుమారుడు రవితేజ బీటెక్ చదువుతున్నాడు. మూడో కుమారుడు గుజరాత్‌లో చదువుతున్నాడు. భర్త, కుమారుడిని మృత్యుదేవత తీసుకుపోయిందంటూ సత్యనారాయణ భార్య కాశీ అన్నపూర్ణ బోరున విలపిస్తోంది.
- మృతులు రేలంగి లక్ష్మి, ఆత్కూరి దుర్గ స్వయంగా అక్కాచెల్లెళ్లు. చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన రేలంగి లక్ష్మి ఇంటి వద్దే కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. ముగ్గురు కుమారులు. ఇద్దరికి వివాహమైంది. చిన్న కుమారుడు దుర్గారావు గ్రామ వలంటీర్‌గా పని చేస్తూ తల్లికి ఆసరాగా ఉంటున్నాడు.
- చాగల్లు మండలం మీనానగరానికి చెందిన ఆత్కూరి దుర్గ సీజన్‌లో తేగలు అమ్ముతూ భర్త రత్తయ్యకు చేదోడుగా ఉండేది. వీరికి ఆరుగురు కుమార్తెలు. వీరు దత్తతగా ఇచ్చిన కుమార్తె మిద్దే అరుణ కూడా ఈ ప్రమాదంలో మృతి చెందింది. మిగిలిన ఐదుగురు కుమార్తెలకూ వివాహం చేశారు. ప్రస్తుతం ఆఖరి కుమార్తె శిరీష ఇటీవల ప్రసవించింది. వారి ఆలనా పాలనా దుర్గ చూసుకుంటోంది.
- మరో మృతురాలు మిద్దే అరుణది నిరుపేద కుటుంబం. భర్త వెంకటేశ్వరరావు ఐస్‌ఫ్రూట్ బండిపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.
- ఈ ప్రమాదంలో మృతి చెందిన దాసరి శ్రావణి కుమారిది ఏలూరు జిల్లా పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేట. ఈమె నాలుగు రోజుల క్రితం ఆత్రేయపురం మండలం వెలిచర్లలోని ఆడపడుచు ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి బంధువులతో కలిసి హైదరాబాద్ వెళ్లింది. తిరిగి కారులో బయలుదేరి వస్తుండగా ప్రమాదానికి గురైంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. కుమార్తెను అమ్మమ్మ ఇంట్లో ఉంచింది. ఈ ప్రమాదంలో ఆమె నెలల కుమారుడు గగన్ కూడా మృతి చెందాడు. శ్రావణి కుమారి భర్త సూరిబాబు స్వస్థలం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలోని పాత పైడిపాక. పాల వ్యాపారం చేసుకుంటూ ఎల్ఎన్‌డీ పేటలో నివసిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే..

ఈ ప్రమాదానికి లారీ డ్రైవర్ తప్పిదమే కారణమని భావిస్తున్నారు. పిడుగురాళ్ల నుంచి పెద్దాపురానికి ధాన్యం లోడుతో వెళ్తున్న ఈ లారీని డ్రైవర్ అన్నమయ్య నిలుపకూడని ప్రాంతంలో ఆపాడు. అదే ఈ ప్రమాదానికి కారణమైంది. గుండుగొలను – దివాన్‌చెరువు మార్గాన్ని 16వ నంబర్ జాతీయ రహదారిగా మార్చిన తరువాత ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సంఘటన స్థలం.. భీతావహం

నుజ్జునుజ్జయిన కారు.. నెత్తుటి మయమై, అందులో ఇరుక్కుపోయిన మృతదేహాలు.. చెల్లాచెదురుగా పడి ఉన్న బ్యాగ్‌లు, శుభకార్యంలో పెట్టిన పట్టుచీరలు, దుస్తులతో సంఘటన స్థలం భీతావహంగా మారింది. మృతదేహాలను వెలికి తీయడానికి స్థానికులు, పోలీసులు ఎంతో శ్రమించారు. నల్లజర్ల సీఐ నున్న రాజు, ఎస్సై నరసింహమూర్తి, సిబ్బందితో వచ్చి రెండు క్రేన్‌ల సాయంతో కారును లాగి.. అందులో ఇరుక్కుపోయిన సత్యనారాయణ, అతడి కుమారుడు రవితేజ మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



చిన్నారి గగన్‌సాయి మృతదేహం



మృత్యుంజయుడు సాయికుమార్



ఊనగట్లలో మృతురాలు లక్ష్మి ఇంటి వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



భార్య, కుమారుడి మృతితో రోదిస్తున్న అరుణ భర్త వెంకటేశ్వరరావు

ఊపందుకున్న నారుమళ్లు

జిల్లా వ్యాప్తంగా 25.20 శాతం నారుమళ్లు పూర్తి

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి నారుమళ్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే సరాసరి 25.20 శాతం ఆయకట్టుకు సరిపడా నారుమళ్లు పోశారు. చాగల్లు మండలంలో గరిష్ఠంగా 70 శాతం, కొవ్వూరులో 68 శాతం నారుమళ్ల ప్రక్రియ పూర్తయ్యింది. తాళ్లపూడిలో 50 శాతం, నిడదవోలులో 45 శాతం నారు మళ్లు పోశారు. ఈ మండలాల్లో బోర్ల కింద రైతులు మురగ దమ్ములు చేస్తున్నారు. ఇప్పటికే కొవ్వూరు,చాగల్లు మండలాల్లో పలుచోట్ల నారు తీతకి వచ్చింది. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో నాట్లు వేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. రుతు పవనాలు రాష్ట్రమంతటా విస్తరించి వర్షాలు కురవడానికి నాలుగైదు రోజులు సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. రైతులు రుతు పవనాల ఆగమనాన్ని దృష్టిలో ఉంచుకుని మురగ దమ్ములు చేయడం ప్రారంభించారు. వాతావరణం అనుకూలిస్తే వచ్చే వారం నుంచి నాట్లు ప్రారంభించేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలో కోరుకొండ, గోకవరం మినహా మిగిలిన మండలాల్లో ఖరీఫ్ నారుమళ్ల ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. కడియం, ఉండ్రాజవరం, నల్లజర్ల మండలాల్లో 25 శాతం ఆయకట్టులో నారుమళ్లు పోశారు. బిక్కవోలు, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి, సీతానగరం, పెరవలి, గోపాలపురం మండలాల్లో పదిశాతం లోపు మాత్రమే పోశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 78,739 హెక్టార్లకు గాను 3,729 హెక్టార్లు నారుమళ్లు పోయాల్సి ఉండగా సోమవారం సాయంత్రానికి 940 హెక్టార్లలో పోశారని అధికారులు చెబుతున్నారు. చాగల్లు, కొవ్వూరు,నిడదవోలు,తాళ్లపూడి మండలాల్లో నాట్లు వేసేందుకు భూములు సిద్ధం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజుల్లో వడివడిగా నాట్లు ప్రారంభం అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు చెప్పారు.



కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో నాట్లకు సిద్ధంగా ఉన్న వరి నారుమడి

నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులపై చర్యలు

డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక దానవాయిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆయన సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమంగా ఆసుపత్రులపై నిఘా ఉంచి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తనిఖీ నోటిఫైడ్ రోగాల వివరాలను విధిగా ఆన్‌లైన్‌లో ఉంచి, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌కు అనుసంధానం చేయాలన్నారు. జనన ధ్రువీకరణ వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సరైన కారణాలు లేకుండా అబార్షన్ చేయరాదన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్టం పటిష్టంగా అమలు పర్చాలన్నారు. ఆరోగ్యశ్రీ రోగుల నుంచి సొమ్ము వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులే కాదు ప్రైవేటు ఆసుపత్రులు కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వానికి ఇవ్వవలసిన వివరాలు సరైన సమయంలో ఆన్‌లైన్‌లో సమర్పించేలా నిత్యం పర్యవేక్షించాలని జిల్లా అధికారులకు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. తనిఖీ చేసిన ఆసుపత్రులకు సంబంధించిన నివేదికను కుటుంబ సంక్షేమ శాఖ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించేలా ప్రతి ఆసుపత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. డెంగీ, టీబీ వంటి వ్యాధులు సోకినప్పుడు ప్రైవేట్ ఆసుపత్రులు తప్పకుండా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలన్నారు. ఏ జ్వరం వచ్చినా డెంగీ అని ప్లేట్‌లెట్లు తగ్గాయని, వ్యాధి నిర్ధారణ కాకుండా డెంగీ అని ప్రకటించరాదన్నారు. ప్రతి వైరల్ జ్వరంలోనూ ప్లేట్‌లెట్లు తగ్గుతాయన్నారు. ఎలిసా టెస్ట్ లో నిర్ధారణ అయితేనే డెంగీగా పరిగణించాలన్నారు. మిగిలిన ఏ పరీక్షల ఆధారంగానైనా నిర్ధారిస్తే తనిఖీ నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. జిల్లా సెర్వైలెన్స్ అధికారి డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ ప్రాణాంతక మలేరియా, డెంగీ, టీబీ, మ్యూకో మైకోసిస్ (బ్లాక్ ఫంగస్) హ్యూమన్ రాబిస్, టైఫాయిడ్ వంటి వ్యాధుల వివరాలను ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌లోను, అబార్షన్, ప్రసవ శస్త్ర చికిత్సల వివరాలు హెల్త్ మెడికల్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో పొందుపరచాలన్నారు. ఆయన వెంట ఎపిడమాలజిస్ట్ సుధీర్, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.



దానవాయిపేటలో ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

విద్యావ్యవస్థలో వినూత్న మార్పులకు శ్రీకారం

- పాఠశాలలు తెరిచిన నాడే జగనన్న విద్యా కానుక పంపిణీ
- పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం వివిధ పథకాలు
- రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత



రాజమహేంద్రవరంలోని కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను తీసుకుని ఉత్సాహంగా తరగతికి వెళుతున్న విద్యార్థులు



శాటిలైట్‌సిటీ హైస్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీలో హోంమంత్రి తానేటి వనిత, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్, మేడపాటి షర్మిలారెడ్డి, డీఈఓ ఎస్. అబ్రహం

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాలలు పునః ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి డా.తానేటి వనిత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న విద్యా కానుక (నాల్గవ విడత) జిల్లాస్థాయి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆమె జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ జగనన్న కానుక కిట్‌గా యూనిఫారం, షూ, సాక్స్, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీలు అందించి పేద విద్యార్థులు చదువు కునేందుకు గొప్ప అవకాశాన్ని సీఎం జగనన్న కల్పించారన్నారు. గత ప్రభుత్వాల కాలంలో నెలలు గడిచినా కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందేవి కావన్నారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్నా యూనిఫాం అందేది కాదన్నారు. నేడు పాఠశాలలు ప్రారంభం రోజునే స్వయంగా సీఎం దగ్గరుండి విద్యార్థులకు విద్యాకానుక అందిస్తున్నారన్నారు. సీఎం విద్యా శాఖలో విన్నూత్నమైన మార్పులు తెచ్చారన్నారు. పేద విద్యార్థులందరూ చదువుకోవాలన్న లక్ష్యంతో అమ్మఒడి, విద్యా కానుక, విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు మధ్యాహ్నం భోజన పథకం, నాడు నేడు ద్వారా పాఠశాలలు ఆధునీకరణ చేపట్టారన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు.

విద్యా కానుక కిట్లకు రూ.30 కోట్లు

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలోని 990 ప్రభుత్వ పాఠశాలల్లో 1,21,730 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.30 కోట్లకు పైగా వెచ్చించిందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందనే సంకల్పంతో పాఠశాలలు ఆధునీకరిస్తున్నారన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు అన్ని రకాల వసతులు కల్పించారన్నారు. శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనే ఇందుకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లావిద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, మండల విద్యాశాఖాధికారి తులసీదాస్, తహసీల్దార్ పైడి చిన్నారావు, మండల పరిషత్ పరిపాలనాధికారి సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని బత్తిన రాజరాజేశ్వరి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కాకుర్తి మురళి, సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగన్ మావయ్యకు కృతజ్ఞతలు



సీఎం జగన్ మావయ్య అమ్మ ఒడిపథకంతో పాటు గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. దీని వలన ఎటువంటి ఇబ్బందులు లేకుండా బాగా చదివాను. పదో తరగతిలో 558 మార్కులు సాధించాను. ఇప్పుడు ఇదే పాఠశాలలో ప్లస్–2లో ఇంటర్ ప్రథమసంవత్సరం జాయిన్ అయ్యాను. సీఎం జగన్ మావయ్యకు కృతజ్ఞతలు.

– వల్లభొట్టి హిమవెంకటరత్నం, విద్యార్థిని, శాటిలైట్‌సిటీ

పిల్లల చదువుకు దిగులు లేదు



మాకు ముగ్గురు అమ్మాయిలు. వారిని ప్రైవేటు కాన్వెంటులో చదివించేటప్పుడు భారీగా ఖర్చయ్యేది. ముగ్గురు ఆడపిల్లలను జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వేసిన తరువాత బాధలన్నీ పోయాయి.పెద్ద అమ్మాయి లిఖిత 10వతరగతి పూర్తిచేయగా, ధనుశ్రీ తొమ్మిది, తేజస్వి ఏడవతరగతి చదువుతున్నారు. సీఎం జగన్ అన్న పిల్లలకు కావాల్సిన స్కూల్ యూనిఫాం దగ్గర నుంచి పుస్తకాల వరకు విద్యాకానుక కిట్లు ద్వారా అందివ్వడంతో పాటు, మధ్యాహ్నం గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. పిల్లల చదువుల కోసం ఎటువంటి దిగులు లేదు.

– లబ్బా కృష్ణవేణి, శాటిలైట్‌సిటీ బీబ్లాక్

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

మధురపూడి: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ తీర్థం సందర్భంగా జరిగిన రథోత్సవంలో గాయాలపాలైన కాపా నాగబాబును సోమవారం ఆయన పరామర్శించారు. వికలాంగుడైన నాగబాబుకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఆయన సతీమణికి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చారు. నాగబాబుకు కృత్రిమ కాలును అమర్చడానికి జక్కంపూడి రామ్మోనరావు ఫౌండేషన్ ద్వారా సాయం చేస్తామన్నారు. ఈ ఘటనలో గాయపడిన కూర్మదాసు శ్రీనివాస్‌కు రూ.లక్ష చెక్కు అందించారు.అలాగే కోటికేశవరం గ్రామానికి చెందిన బూలా రాంబాబు గ్రామంలో కల్వర్టు నిర్మాణం కోసం గోతిలో పనిచేస్తుండగా మట్టి గడ్డలు పడటంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి రూ.రూ.2 లక్షల చెక్కు అందజేశారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ చేసిన ఆరోపణలను ఖండించారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, పార్టీ కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, ఉల్లి బుజ్జిబాబు, నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, శివాజీ, అయిల రామకృష్ణ, నేతుల చిన్ని, బొండాడ చందు పాల్గొన్నారు.



నాగబాబుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాజా

క్లుప్తంగా

అవార్డు అందుకున్న సత్యనారాయణరాజు


రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న మంతెన సత్యనారాయణరాజు

పి.గన్నవరం: మండలంలోని **గంటి** పెదపూడికి చెందిన అభ్యుదయ **రైతు** మంతెన సత్యనారాయణ**రాజు** సోమవారం రాష్ట్ర ఉత్తమ రైతు **అవార్డు** అందుకున్నారు. గుంటూ**రులో** సోమవారం జరిగిన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవ సభలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఉప కులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సత్యనారాయణరాజు అవార్డు అందుకున్నారని పెద్దాపురం ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. శ్రీ వి.రామచంద్రరావు మెమోరియల్ ఉత్తమ రైతు అవార్డు పేరిట రూ.25 వేల నగదు ప్రోత్సాహకం, మెమెంటో, పురస్కార పత్రం అందజేశారని చెప్పారు. గోదావరి, కృష్ణా, గుంటూరు ప్రాంతాల నుంచి సత్యనారాయణరాజుకు మాత్రమే అరుదైన ఈ అవకాశం దక్కిందన్నారు. అవార్డు అందుకున్న సత్యనారాయణ రాజును మార్టేరు పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి, కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు, గోదావరి మండల శాస్త్రవేత్తలు ప్రశంసించారు.


చేపల విక్రయాలతో కళకళలాడిన తీరం


మత్స్య సంపదతో నిండిన బోట్లు


అమీనాబాద్ తీరంలో లారీల్లోకి చేపలను ఎక్కిస్తున్న వ్యాపారులు

తీరం కళకళ.. కాసుల గలగల

- సుమారు 200 టన్నుల చేపల ఎగుమతి
- రూ.2.5 కోట్ల మేర వ్యాపారం
- మత్స్యకారుల ఆనందం

కొత్తపల్లి: వేట నిషేధంతో రెండు నెలలుగా బోసిపోయిన అమీనాబాద్ సముద్ర తీరం సోమవారం మత్స్యకారుల సందడితో కళకళలాడింది. సముద్రంలో చేపల వేటపై నిషేధాన్ని బుధవారం అర్ధరాత్రి నుంచి ఎత్తివేశారు. దీంతో ముందుగానే వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు చేపలు భారీగానే చిక్కాయి. ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట గ్రామాలకు చెందిన సుమారు 100 బోట్లపై మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. ఒక్కో బోటుపై 2 నుంచి 3 టన్నుల వరకూ కాణా గొరస, టైగర్ రొయ్యలు వలలకు చిక్కాయి. వీటి విలువ రూ.2.5 కోట్లు ఉంటుందని మత్స్యకారులు ఆనందంగా చెప్పారు. ఈ మత్స్య సంపదను వందలాది లారీల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు తరలించారు. చేపల ఎగుమతితో కాకినాడ – తుని బీచ్ రోడ్డులో అమీనాబాదు నుంచి రామన్నపాలెం వరకూ సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. చేపల ఎగుమతులు, వ్యాపారాల్లో మత్స్యకారులు బిజీబిజీగా కనిపించారు.

రోడ్డు ప్రమాద ఘటనపై హోం మంత్రి దిగ్భ్రాంతి


హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: నల్లజర్ల మండలం అనంతపల్లిలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడంపై రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన బంధువులు కావడం బాధాకరం అన్నారు. మృతుల్లో నెలల పాప ఉండటం అత్యంత బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. మృతుల్లో తన నియోజకవర్గం పరిధిలో చాగల్లు మండలానికి చెందిన ఇద్దరు మహిళలున్నారని మంత్రి వనిత చెప్పారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు
- ధవళేశ్వరంలో జేవీకే కిట్ల పంపిణీ


ధవళేశ్వరంలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జరిగిన విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక ద్వారా బ్యాగ్, పుస్తకాలు, యూనిఫాం, షూస్, బెల్టులు అందించడం హర్షణీయమని అన్నారు. ఇటీవలి పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు సాధించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి ఫలితమేనని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ రేగుళ్ల రవి, వైఎస్సార్ సీపీ నాయకులు విప్పర్తి రమణ, జంగా కిషోర్, పసుపులేటి దేవి, చప్పిడి జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు యు.సత్యనారాయణ పాల్గొన్నారు.

మూసుకుపోయిన వరద రక్షణ గేట్లు


అక్విడెక్టుకు ఎల్.గన్నవరం వైపు మూసుకుపోయిన వరద రక్షణ గేట్లు


అక్విడెక్టు నుంచి నదిలోకి జాలువారుతున్న నీరు

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టు కాలువకు ఏర్పాటు చేసిన వరద రక్షణ గేట్లలో ఎల్.గన్నవరం వైపు గేట్లు సోమవారం మూసుకుపోయాయి. దీంతో దిగువ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కాలువలో నీటిమట్టం పెరిగింది. ఆ నీరు తొట్టి నుంచి వశిష్ట నదిలో జాలువారింది. వరదల సమయంలో నదిలోని నీరు కాలువలోకి వచ్చి ఎగువ, దిగువ గ్రామాలు మునిగిపోతున్న నేపథ్యంలో.. గతంలో అక్విడెక్టుకు ఇరువైపులా వరద రక్షణ గేట్లు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇవి పని చేయకపోవడంతో ఇటీవల వాటికి మరమ్మతులు చేశారు. పి.గన్నవరం ప్రధాన పంట కాలువకు శనివారం రాత్రి నీరు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో నీటి వడికి ఎల్.గన్నవరం వైపు ఉన్న రెండు గేట్లు మూసుకుపోయాయి. దీంతో దిగువ ప్రాంతానికి నీటి సరఫరా ఆగిపోయింది. ఆ గేట్లను ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వరరావు పరిశీలించారు. వర్క్‌షాపు సిబ్బందిని తీసుకువచ్చి గేట్లను తెరిచేందుకు చర్యలు చేపట్టారు. అప్పటికే కాలువలో నీరు నిండుగా ఉండటంతో గేట్లు తెరచుకోలేదు. కాలువలో నీటిమట్టాన్ని తగ్గించి, గేట్లు తెరచి, దిగువ ప్రాంతాలకు నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు.

‘మా బిడ్డను కాపాడరూ..’

- రోడ్డు ప్రమాదంలో కుమారుడికి తీవ్ర గాయం
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల అభ్యర్థన


చికిత్స పొందుతున్న గోవిందు

కాకినాడ క్రైం: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. చేతికి అంది వచ్చిన కొడుకు దుస్థితి చూసి ఆ నిరుపేద తల్లిదండ్రులు విలవిలలాడిపోతున్నారు. తమ బిడ్డకు జీవితాన్నిచ్చే దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త కాకినాడ ప్రాంతానికి చెందిన ఎరిపల్లి రాజు, పోలేరు దంపతులకు 21 ఏళ్ల గోవిందు ఒక్కగానొక్క సంతానం. పెయింటర్‌గా పని చేస్తున్న గోవిందు గత నెల 30వ తేదీ రాత్రి డైరీఫాం నుంచి స్నేహితుడైన రాజు ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని తన ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో ఓ వ్యాను వారి వాహనాన్ని ఢీకొంది. రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. గోవిందు తల రోడ్డుకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. మొదట చిన్న గాయమేనని భావించిన రాజు.. గోవిందు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి జీజీహెచ్‌లో చేర్పాడు. వైద్యులు గోవిందును పరీక్షించి తలలో రక్తం గడ్డ కట్టిందని, మెదడుకు రక్త ప్రవాహంలో ఆటంకం ఏర్పడిందని నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం గోవింద్‌ను నాగమల్లితోట జంక్షన్‌లోని న్యూరోసర్జరీ సేవలున్న ఆస్పత్రిలో చేర్పారు. గోవిందు పూర్తి చికిత్సకు రూ.15 లక్షలు ఖర్చవుతుందని అక్కడి వైద్యులు చెప్పారు. అంత మొత్తాన్ని సమకూర్చలేని తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు పెద్ద మనసు చేసుకుని తమ కుమారుడిని కాపాడాలని, సాయం చేయాలనుకునే వారు 82971 43765 నంబర్‌కు ఫోన్ చేయాలని గోవింద్ తండ్రి రాజు అభ్యర్థిస్తున్నాడు.

క్రైం కార్నర్..


స్కూటీ డిక్కీ నుంచి రూ.లక్ష చోరీ

అమలాపురం టౌన్: స్కూటర్ డిక్కీలో దాచిన సొమ్మును నిమిషాల వ్యవధిలోనే దొంగలు తస్కరించారు. అమలాపురం రూరల్ పేరూరుకు చెందిన కె.రామప్రసాద్ వై.జంక్షన్‌లో కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నారు. నిర్మాణ పనులకు అవసరమవడంతో అమలాపురం బ్యాంక్ స్ట్రీట్‌లోని యూనియన్ బ్యాంక్‌కు సోమవారం మధ్యాహ్నం వచ్చారు. తన అకౌంట్ నుంచి రూ.లక్ష నగదు డ్రా చేసుకున్నారు. ఆ మొత్తాన్ని, బ్యాంక్ పాస్‌బుక్‌ను ఓ కవర్‌లో పెట్టి, తన స్కూటీ డిక్కీలో ఉంచి, తాళం వేశారు. దాహంగా ఉందని రోడ్డు అవతల ఉన్న జ్యూస్ షాపు వద్దకు వెళ్లి వచ్చారు. తిరిగి వచ్చేసరికి డిక్కీ తెరచి ఉంది. అనుమానం వచ్చి చూసుకుంటే అందులో నగదుతో ఉంచిన కవర్ లేదని గుర్తించారు. దీంతో కంగారు పడి, బ్యాంక్ బయట, లోపల ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. ఆయన స్కూటీ డిక్కీలో నగదు పెడుతున్నప్పుడు గమనించిన ఆగంతకులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని తోటి ఖాతాదారులు భావిస్తున్నారు. దీనిపై బాధితుడు రామప్రసాద్ తక్షణమే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గా శేఖరరెడ్డి పరిశీలించారు. బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. బ్యాంక్, ఆ పక్కన ఉన్న దుకాణాల్లో సీసీ కెమెరాలు సరిగా పని చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అందుబాటులో సీసీ ఫుటేజీలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ దుర్గా శేఖరరెడ్డి తెలిపారు.

గోదావరిలో వృద్ధుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు: ఔరంగబాద్ సమీపాన గోదావరి నదిలో సోమవారం ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ కథనం ప్రకారం.. మృతుడిని ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన సరికొండ వీరభద్రరావు(60)గా గుర్తించారు. అతడు ఈ నెల 10వ తేదీన ఏలూరు ఆసుపత్రికి వెళ్లి వస్తానని గ్రామంలోని కిళ్లీ షాపు వద్ద చెప్పాడు. ఇప్పటి వరకూ తిరిగి రాలేదు. వీరభద్రరావు భార్య రెండేళ్ల కిత్రం మృతి చెందింది. దీంతో తాను చనిపోవాలనుకునే వాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆమె అస్తికలను గోదావరిలో నిమజ్జనం చేసే సమయంలోనే చనిపోవాలనేవాడని మృతుడి కుమారుడు రవి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. వీరభద్రరావు అదృశ్యంపై కుమారుడు తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గోదావరిలో లభ్యమైన మృతదేహం తన తండ్రిదేనని రవి గుర్తించాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పనులు చేస్తూ ఇద్దరు ఉపాధి కూలీల మృతి


చినసత్యం (పాతచిత్రం)


గంటా సత్యం మృతదేహం

కొత్తపేట/ఆలమూరు: పనులు చేస్తున్న ఇద్దరు ఉపాధి కూలీలు మృతి చెందిన సంఘటనలు సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్నాయి. కొత్తపేట మండలం పలివెల పెదపేటకు చెందిన బట్టు చినసత్యం (77) సహచర కూలీలతో కలిసి నాలుగు వారాలుగా ఉపాధి పనుల్లో పాల్గొంటున్నాడు. ఉదయం బురద తూము వంతెన నుంచి చొదరిపురం వంతెన వరకూ ఉన్న డ్రెయిన్ పని చేస్తూండగా గుండెపోటు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే మేట్, సహచర కూలీలు కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తూండగా మార్గం మధ్యలోనే చనిపోయాడు. మరో ఘటనలో ఆలమూరు మండలం పెదపళ్ల ఎస్సీ పేటకు చెందిన ఉపాధి కూలీ గంటా సత్యం (75) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం బొబ్బా వారి పుంత రోడ్డులో సత్యం ఉపాధి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో హఠాత్తుగా కుప్పకూలిపోవడంతో సహచర కూలీలు సపర్యలు చేశారు. అయినా ప్రయోజనం లేక అక్కడికక్కడే మృతి చెందాడు. ఫీల్డ్ అసిస్టెంట్ అంగర రామకృష్ణ ఫిర్యాదు మేరకు వీఆర్‌ఓ బి.ఉదయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. ఏపీఎం పి.వరప్రసాద్‌కు సమాచారం అందజేశారు.

కాలువలో పడి వృద్ధురాలి మృతి

పెదపూడి: ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఒక వృద్ధురాలు మృతి చెందింది. ఏఎస్సై వి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. దోమాడ గ్రామానికి చెందిన ఏలూరి లక్ష్మి(60) తన సోదరుడు వై.వీర్రాజు ఇంటి వద్ద ఉంటోంది. ఆదివారం సాయంత్రం కాకినాడ వైపు వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో వీర్రాజు చుట్టుపక్కల వెతికాడు. ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం ఏపీ త్రయం కాలువ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్టు సమాచారం తెలియడంతో అక్కడికి వెళ్లాడు. ఆ మృతదేహం తన సోదరి లక్ష్మిదేనని గుర్తించారు. వీర్రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మామిడాడలో భారీ చోరీ

జగ్గంపేట: మండలంలోని మామిడాడ గ్రామంలో భారీ చోరీ జరిగింది. జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శరకణం శ్రీను, కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ఇంటి బయట నిద్రించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని దుండగులు వెనుక ఉన్న తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తెరచి అందులో ఉన్న 7.5 కాసుల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. శ్రీను ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి క్లూస్ టీము చేరుకున్నాయి. వేలిముద్రలు సేకరించాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరింత రుచికరంగా ఆహార పదార్థాలు

- అన్నదాన పథకంపై అన్నవరం ఈఓ ఆదేశం


అన్నదాన పథకంలో భోజనం చేస్తున్న భక్తులు


ఆహార పదార్థాల రుచిని పరిశీలిస్తున్న ఈఓ అజాద్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి నిత్యాన్నదాన పథకంలో ఆహార పదార్థాలు మరంత రుచిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. అన్నదాన పథకాన్ని ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ ఆహార పదార్థాలు రుచి చూశారు. అనంతరం సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. ఇకపై అన్నదాన పథకంలో రోజు విడిచి రోజు సాంబారు, పప్పుచారు తయారు చేయాలని ఆదేశించారు. ఈ రెండింటిలో ఉపయోగించే కందిపప్పు పది నిమిషాలు వేయించాలని పేర్కొన్నారు. అలాగే, పప్పు, పప్పుచారు, సాంబారు తాలింపులో కేజీకి 0.25 గ్రాముల నెయ్యి వాడాలని ఆదేశించారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ప్రస్తుతం ప్రతి రోజూ ఐదు వేల మంది పైగా భక్తులకు భోజనాలు పెడుతున్నారు. భక్తులిచ్చిన విరాళాలపై వచ్చే వడ్డీతో అన్నదానం చేస్తున్నారు. ఇప్పటికే ఈ విరాళాలు రూ.20 కోట్లు పైబడి ఉన్నాయి. ప్రతి రోజూ రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ భక్తులు విరాళాలుగా సమర్పిస్తున్నారని అధికారులు తెలిపారు.

విదేశీ విద్యార్థుల అడ్మిషన్లకు సన్నాహాలు


షేక్ సులేమాన్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, వర్సిటీ ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వివిధ కోర్సులలో విదేశీ విద్యార్థుల అడ్మిషన్లకు సన్నాహాలు చేస్తున్నట్టు జేఎన్‌టీయూకేలో ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. విదేశీ విద్యార్థుల అడ్మిషన్లపై వర్సిటీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాక్ ఎ+ ర్యాంకింగ్ సాధించడం ద్వారా వర్సిటీలో విదేశీ విద్యార్థులు చదువుకొనే అవకాశం లభించిందన్నారు. విదేశీ విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి ఢిల్లీలోని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్‌లో సేవలందించిన డాక్టర్ షేక్ సులేమాన్ సేవలు వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఆయన ద్వారా 45 దేశాలకు చెందిన ఎంబసీలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ఎంఎం ప్రసాద్ మాట్లాడుతూ, స్టడీ ఇండియా ప్రోగ్రాం కింద 120 దేశాల విద్యార్థులు జేఎన్‌టీయూకేలో చదివే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం కన్సల్టెన్సీ ప్రతినిధి షేక్ సులేమాన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, డీఏపీ మురళీకృష్ణ, డీఈ బాలకృష్ణ, సీఈ రామకృష్ణయ్య, ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఫారిన్ వర్సిటీ డైరెక్టర్ ఎస్.శివ నాగరాజు పాల్గొన్నారు.